## క్లుప్తంగా

### కొనసాగుతున్న సోషల్ ఆడిట్

బొల్లాపల్లి: ఉపాధిహామీ పథకంలో 15వ విడత సోషల్ ఆడిట్ కొనసాగుతోంది. ఈ సందర్భంగా మేళ్లవాగులో గ్రామ సచివాలయం వద్ద సామాజిక తనిఖీల్లో భాగంగా మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో సోషల్ ఆడిట్ బృందం సభ్యులు పాల్గొని తనిఖీల్లో సేకరించిన వివరాలు చదివి వినిపించారు. గ్రామంలో పండ్లతోటల పెంపకంలో నాటిన మొక్కలు పొలంలో లేవని వెల్లడించారు. వర్షాభావంతో నీరు లేక మొక్కలు ఎండిపోయాయని రైతులు తనిఖీ బృందానికి తెలియజేశారు. మస్టర్ల విషయంలో స్వల్ప తేడాలు ఉన్నాయని ఈ మేరకు గ్రామసభలో వివరించినట్లు ఎస్సార్పీ టి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఇప్పటి వరకు మండలంలో పలు పంచాయతీల్లో గ్రామసభలు ముగిశాయని చెప్పారు. అయ్యన్నపాలెం, మర్రిపాలెం, కనుమలచెరువు, ఘాటితండా, నెహ్రూనగర్ తండా, గుట్లపల్లి, వడ్డెంగుంట తదితర పంచాయతీల్లో గ్రామసభలు ముగిశాయని, ఈ నెల 17న మండల కేంద్రంలో సోషల్ ఆడిట్ ప్రజావేదిక నిర్వహిస్తామని తెలిపారు.

### పోలింగ్ కేంద్రాల పరిశీలన



నాదెండ్ల: మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలోని 15 పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ డీవీవీ వరకుమార్ రెవెన్యూ సిబ్బందితో కలిసి మంగళవారం పరిశీలించారు. గణపవరంలో 1-15 బూత్‌లను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని స్థానిక వీఆర్వోలను ఆదేశించారు. ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాలను వెంటనే పరిష్కరించాలన్నారు. త్వరలో కొత్త ఓటర్ల జాబితా గ్రామ పంచాయతీలకు అందించనున్నట్లు చెప్పారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. పద్దెనిమిదేళ్ళ పైబడిన యువతీ యువకులు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆయన వెంట వీఆర్వోలు వెంకట రమణ, సాంబశివరావు, వీరయ్య, అంకమ్మరావు, పంచాయతీ కార్యదర్శులు కవిత, జ్యోతిర్మయి ఉన్నారు.

### నోటరీగా నన్నెబోయిన



నాదెండ్ల: భారత ప్రభుత్వ నోటరీగా నన్నెబోయిన శ్రీనివాసరావు మూడోసారి రెన్యువల్ అయ్యారు. చిలకలూరిపేటకు చెందిన ప్రముఖ న్యాయవాది నన్నెబోయినకు 2009లో తొలిసారి నోటరీగా అవకాశం వచ్చింది. ప్రతి ఐదేళ్లకు ఒకసారి రెన్యువల్ అయి, ప్రస్తుతం మూడో దఫా రెన్యువల్ చేస్తూ కేంద్ర ప్రభుత్వ న్యాయ మంత్రిత్వ శాఖ నుంచి ఈ నెల 12న ఉత్తర్వులు అందుకున్నారు. 2024, ఫిబ్రవరి నుంచి 2029 ఫిబ్రవరి వరకూ ప్రభుత్వ నోటరీగా కొనసాగనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయనున్న అభ్యర్థుల ప్రమాణ పత్రాలను (అఫిడవిట్లు) క్షుణ్ణంగా పరిశీలించి నోటరీ చేస్తానని తెలిపారు. ప్రస్తుతం తాను చిలకలూరిపేట మున్సిపల్ స్టాండింగ్ కౌన్సెల్‌గా కొనసాగుతున్నానని వివరించారు.

### జేఈఈ మెయిన్స్‌లో ఇరువురి ప్రతిభ



షేక్ షరీఫ్ | అనూప్

యడ్లపాడు: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) మంగళవారం జేఈఈ మెయిన్స్ పరీక్ష మొదటి సెషన్ ఫలితాల్లో మండలానికి చెందిన ఇద్దరు అత్యధిక పర్సంటేజీ సాధించాడు. యడ్లపాడు మండలం వంకాయలపాడు గ్రామానికి చెందిన షేక్ సుభాని, మైమూన దంపతుల కుమారుడైన షేక్ షరీఫ్ 99.51 శాతం సాధించాడు. షరీఫ్ తండ్రి షేక్ సుభాని కార్పెంట్‌కాగా, తల్లి మైమూనా గృహిణి. షరీఫ్ విజయవాడలోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతూ జేఈఈ పరీక్షలు రాసి అత్యధిక పర్సెంటేజీని సాధించిన షరీఫ్‌తో పాటు తల్లిదండ్రుల్ని పలువురు అభినందిస్తున్నారు. అలాగే యడ్లపాడు గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ముత్తవరపు రాజ్‌కుమార్, పార్వతీ దంపతులకు ఇద్దరు సంతానం మొదట హర్షిత ఐఐటీ చెన్నైలో బీటెక్ చేస్తుండగా కుమారుడు ముత్తవరపు అనూప్ హైదరాబాద్‌లోని తల్లిదండ్రుల వద్ద ఉంటూ అక్కడే నారాయణ కళాశాలలో చదువుతున్నాడు. జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో అనూప్ 300కు నూరు శాతం పర్సెంటేజీ సాధించడంతో పలువురు అభినందిస్తున్నారు.



# రాష్ట్రంలో విద్యాభివృద్ధికి జగనన్న కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



జిల్లాస్థాయి విజేతలతో కలెక్టర్ శివశంకర్

## ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రంలో విద్యారంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ప్రకాష్ నగర్‌లోని సెయింటాన్స్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ప్రదర్శన-2024ను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని తెలిపారు. మనబడి నాడు-నేడు కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో పాఠశాలల రూపురేఖలనే మార్చారని వివరించారు. అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, ఉచితంగా పుస్తకాలు, దుస్తులు అందించటంతో పాటు ఇంగ్లీష్ మీడియంను ప్రవేశపెట్టి పేద, బడుగు బలహీన వర్గాల చిన్నారులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తున్నారని కొనియాడారు.

పాఠశాల స్థాయి నుంచే చిన్నారులు ఉన్నతంగా ఎదగాలనే లక్ష్యంతో పాఠ్య ప్రణాళికలో సమూల మార్పులు తీసుకువచ్చారని తెలిపారు. ఇంగ్లిషులో ఉత్తమ పరిజ్ఞానంతో పాటు టోఫెల్, ఐబీ వంటి వాటిని పరిచయం చేస్తున్నారని తెలిపారు. ప్రభు త్వం తీసుకుంటున్న చర్యలు కారణంగా ఆంధ్రప్రదేశ్ ఘనతను చిన్నారులు ఐక్యరాజ్య సమితి వంటి అంతర్జాతీయ వేదికలపై చాటుతున్నారని తెలిపా రు. కాగా, వైజ్ఞానిక ప్రదర్శనలో 126 నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఏ.ఏ.మధుకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

**విజేతలకు బహుమతులు అందచేసిన కలెక్టర్**

జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ప్రదర్శనలో విజేతలకు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ బహుమతులు అందచేశారు. పాఠశాలలో సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ శివశంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పాఠశాల స్థాయి నుంచే పరిశోధనల పట్ల విద్యార్థులు ఆసక్తిని పెంపొందించుకోవాలని తెలిపారు. నిజ జీవితంలో సైన్స్ ప్రాధాన్యతను గుర్తించి సమాజానికి అవసరమైన వస్తుసేవల ఆవిష్కరణలకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు, సైన్స్ ఆఫీసర్ ఎ.ఎ.మధుకుమార్, డాక్టర్ కె.మహిమ, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**విజేతలు వీరే....**

జిల్లాస్థాయి ప్రదర్శనలో 126 నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. వీరిలో సిహెచ్.విజయ అమరావతి, జి.నీలిమా, పి.పుణ్యవతి వేల్పూరు, ఎస్.జమీర్, పి.సమీరా యడ్లపాడు, పి.సంధ్య కారంపూడి, జి.వీరలక్ష్మీ జొన్నలగడ్డ, ఎస్.రయ్యాన్ క్రోసూరు, ఎస్.అభిషేక్ బృగుబండ, కె.మమత సిరిగిరిపాడు, డి.భానుబేగం కండ్లకుంట, డి.బాలయేసు నడిగడ్డ విజేతలుగా నిలిచారు. విజేతల నమూనాలను చిత్తూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు జిల్లా సైన్స్ ఆఫీసర్ మధుకుమార్ తెలిపారు.

# సమగ్ర ఆధారాలు ఇవ్వకుంటే తొలగిస్తాం

## తహసీల్దారు లక్ష్మి లావణ్య

శావల్యాపురం: ఫాం-7 అర్జీలకు సమగ్ర ఆధారాలు అందజేయకుంటే అటువంటి వారికి నోటీసులు అందజేయకుండా తొలగిస్తామని తహసీల్దారు నక్కా లక్ష్మి లావణ్య స్పష్టం చేశారు. అలాగే ఫాం-6 నూతన ఓట్లు దరఖాస్తులు సమగ్ర ఆధారాలతో అందజేసిన వారికి ఓటు హక్కు కల్పిస్తామని, ఇరు పార్టీలకు చెందిన నాయకులు సమన్వయం పాటించాలన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ ఆదేశాలు మేరకు అర్హత కలిగి ఉన్న వారందరికీ ఓటు హక్కు కల్పిస్తామని, ప్రజలు అపోహలు నమ్మ వద్దన్నారు. ఫాం-7 తప్పుడు అర్జీలు చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు ఫాం-6 దరఖాస్తులు-350, ఫాం-7 అర్జీలు-600 రాగా వీటన్నింటినీ క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నట్లు తహసీల్దారు వివరించారు. ఒక వ్యక్తికి ఒక చోట మాత్రమే ఓటు హక్కు కల్పిస్తామన్నారు. డబల్ ఎంట్రీల కూడా పరిశీలిస్తున్నామన్నారు. పార్టీలకు అతీతంగా అర్హత కలిగి ఉన్న వారందరికీ ఓటు హక్కు కల్పిస్తామన్నారు. ఓటర్ల జాబితాలో ఏమైనా తప్పులు జరిగితే లిఖిత పూర్వకంగా తెలిపితే ఎన్నికల కమిషనర్ ఆదేశాలు మేరకు సమస్య పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇదిలా ఉంటే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు ఓటర్ల జాబితా ప్రచురణ చేశారు. అయితే ఈ జాబితాల్లో అక్రమాలు జరిగాయంటూ టీడీపీ నాయకులు క్షేత్ర స్థాయిలో పరిశీలించకుండా ఇష్టానుసారంగా ప్రకటనలు చేస్తుండటంతో రెవెన్యూ అధికారులు సతమతమవుతున్నారు. దీంతో రెవెన్యూ సిబ్బంది ఎక్కువ భాగం ఈ జాబితా వెరిఫికేషన్ పనుల్లో నిమగ్నం అవుతుండటంతో వేర్వేరు పనుల కోసం కార్యాలయానికి వచ్చిన వారు తమ పనులు ఆలస్యం అవుతుండటంతో ఆందోళన చెందుతున్నారు.

# అనారోగ్య సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష శిబిరాలు

- ఎంపీపీ తలతోటి రాణి
- 425 మందికి వైద్య పరీక్షలు
- ఉచితంగా మందులు పంపిణీ



కనపర్రులో లబ్ధిదారులకు మెడికల్ కిట్లు అందిస్తున్న ఎంపీపీ రాణి, సర్పంచ్ వెంకటేశ్వర్లు

నాదెండ్ల: అనారోగ్య సమస్యలతో ఏ ఒక్కరూ ఆర్థిక ఇబ్బందులు పడకూడదన్న సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులకు శ్రీకారం చుట్టినట్లు ఎంపీపీ తలతోటి రాణి చెప్పారు. కనపర్రు సచివాలయంలో మంగళవారం సర్పంచ్ పెరుమాళ్ళపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించారు. గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కవిత అనసూయ, ఆర్థోపెడిక్ వైద్యులు చంద్రశేఖర్‌రెడ్డి, స్త్రీల వైద్యనిపుణులు డాక్టర్ శ్రావణి పాల్గొని 425 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో విడతల వారీగా వైద్య క్యాంపులు నిర్వహించి పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి 15 రోజులకోసారి ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానంలో మంచానికే పరిమితమైన వారికి ఇళ్ళవద్ద వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు మందుల కిట్లు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్, జగనన్న సురక్ష మండల కన్వీనర్ అల్లడి రవికుమార్, నాదెండ్ల సొసైటీ అధ్యక్షులు కురుకుంట్ల వెంకటరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉష, పీఎస్ కాంతారావు, సచివాలయ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.


**మతుకుమల్లిలో..**

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించినట్లు ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేదలందరికి మెరుగైన వైద్యసేవలు పారదర్శకంగా అందేలా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను ఏర్పాటు చేసిందన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి మాణ్యం రాధాకృష్ణన్ వైద్య శిబిరంలో పాల్గొని 402 మందికి వైద్యసేవలు అందించి అవసరమైన వారందరికీ ఉచితంగా మందులు 14 రకాల వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యలగాల బసవయ్య, వైద్యాధికారులు కరిముల్లా, దుర్గాంబ, కంటి వైద్య నిపుణులు చాంద్‌బాష, సూపర్‌వైజర్లు ఏడుకొండలు, ఉమాదేవి ఆరోగ్య కార్యకర్త శ్రీలలితాకుమారి వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.



ముతుకుమల్లిలో వైద్యసేవలు అందిస్తున్న వైద్యాధికారి రాధాకృష్ణన్

# క్రీడా మైదానాల అభివృద్ధికి నిధులు మంజూరు



పనులు పరిశీలిస్తున్న విశ్వనాథ్

శావల్యాపురం: నియోజకరవ్గంలోని ఐదు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో క్రీడా మైదానాలు అభివృద్ధి పనులకు రూ. 25 లక్షలు నిధులు ప్రభుత్వం మంజూరు చేసినట్లు నాడు-నేడు మన బడి పథకం ఏఈ విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి క్రీడా మైదాన పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఏఈ మాట్లాడుతూ ఒక్కో జెడ్పీ ఉన్నత పాఠశాల్లో క్రీడామైదానం అభివృద్ధి పనులకు గాను పీఎంసీ నిధులు రూ. 5 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఇందులో భాగంగా నూజెండ్ల-5 లక్షలు, శావల్యాపురం-5 లక్షలు, వినుకొండ రూరల్ నాగులవరం గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాల-రూ.5 లక్షలు, బొల్లాపల్లి మండలం వెల్లటూరు గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాలకు-రూ.5 లక్షలు, ఈపూరు మండలం ఈపూరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు రూ. 5 లక్షలు నిధులు మంజూరైనట్లు ఏఈ తెలిపారు.

## పసి పిల్లలకు కంటి పరీక్షలు



నరసరావుపేట: ఏరియా ఆసుపత్రిలో మంగళవారం బరువు తక్కువతో పుట్టిన 12 మంది పిల్లలకు రాజమండ్రి గౌతమి నేత్రాలయం సహకారంతో రెటినోపతి ఆఫ్ ప్రీ మెచ్యురిటీ కంటి పరీక్షలు నిర్వహించారు. నెలలు పసికందులు, పుట్టినప్పుడు రెండుకేజీల కన్న తక్కువ బరువుతో ఉన్న పిల్లలకు కంటి నరముల ఎదుగుదల సమస్య ఉన్నదా లేదా అని తెలుసుకునేందుకు ఈ పరీక్షలు చేశారు. ఇలా ప్రతి నెలా ఈ స్క్రీనింగ్ పరీక్షలు చేసి ఏదన్నా సమస్య ఉంటే ఉచితంగా వైద్యం అందిస్తారని ఆర్‌బీఎస్‌కే జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ రాజరాజేశ్వరి చెప్పారు. ఆప్టోమెట్రిస్ గ్రేస్, డెంటిస్టు డాక్టర్ హ్యాండవి మార్ట్యూర్ ఇతర డీఇఐసీ సిబ్బంది పాల్గొన్నారు.

## కారు ఢీకొని ఒకరికి గాయాలు

నాదెండ్ల: ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న కారు ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మంగళవారం గుంటూరు-కర్నూలు జాతీయ రహదారిపై సాతులూరు సమీపంలో చోటు చేసుకుంది. 108 సిబ్బంది తెలిపిన వివరాల మేరకు ఫిరంగిపురం మండలం నుదురుపాడు గ్రామానికి చెందిన మల్లికార్జున రావు వ్యక్తిగత పనులపై నరసరావుపేట నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. సాతులూరు వద్దకు వచ్చేసరికి గుంటూరు నుంచి నరసరావుపేట వైపు వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలైన మల్లికార్జునరావును 108 సాయంతో నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

నరసరావుపేటటౌన్: ప్రయాణికులతో వెళ్తున్న ఆటోని లారీ ఢీకొన్న సంఘటన మంగళవారం పట్టణ శివారు జొన్నలగడ్డ వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ప్రయాణికులతో వస్తున్న ఆటోను మిర్చిలోడుతో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని ప్రయివేట్ వైద్యశాలకు తరలించారు. సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని రూరల్ ఎస్‌ఐ రోశయ్య తెలిపారు.

## హత్య కేసులో నిందితుడి అరెస్టు

చిలకలూరిపేట టౌన్: వ్యక్తిపై దాడి చేసి అతని మృతికి కారణమైన ఘటనలో నిందితుడిని మంగళవారం అర్బన్ పోలీసులు అరెస్టు చేశారు. అర్బన్ సీఐ పి రమేష్ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల ఆరో తేదీ పట్టణంలోని సుగాలి కాలనీకి చెందిన సురేష్ నాయక్ (40) బావమర్ది రవితేజా, స్నేహితులు వేణు, భీమా నాయక్, వెంకటేశ్వర్లు నాయక్‌తో కలసి పట్టణంలోని సింగ్‌నగర్ ప్రభుత్వ వైన్స్ వద్ద మద్యం సేవించడానికి వెళ్లారు. ఈ క్రమంలో పాత కక్షల నేపథ్యంలో వెంకటేశ్వర్లు నాయక్ నాపరాయితో సురేష్ నాయక్ తలపై కొట్టాడు. ఈ దాడిలో సురేష్ నాయక్‌కు గాయాలై స్పృహ కోల్పోయాడు. దీంతో స్నేహితులు అతన్ని భార్య శ్రావణీబాయికి అప్పగించారు. గాయపడిన సురేష్ నాయక్‌ను భార్య శ్రావణిబాయి పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల11 తేదీ సురేష్‌నాయక్ మృతి చెందాడు. మృతుడి భార్య శ్రావణి బాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు వెంకటేశ్వర్లు నాయక్‌ను పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో అరెస్టు చేశారు.

## సహాయం చేసిన హోంగార్డులు అభినందనీయులు

నరసరావుపేట: తమ సహోద్యోగుల కుటుంబాలకి సహాయం చేయడానికి ఒక్కొక్కరికి తమ ఒక్కరోజు వేతనాన్ని అందించిన జిల్లా హోంగార్డులు అభినందనీయులని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్ రెడ్డి కితాబు ఇచ్చారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అనారోగ్యంతో మరణించిన, అనారోగ్యంతో బాధపడుతూ వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్న రెండు హోంగార్డుల కుటుంబాలకు రూ.9 లక్షల విలువైన ఆర్థిక సహాయం చెక్కులు అందజేశారు. రేపల్లె టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ గతేడాది జూన్ రెండోతేదీన అనారోగ్యంతో మృతిచెందిన హోంగార్డు ఎ.శేషుకాంతారావుకి జిల్లాలోని హోమ్ గార్డులు అందరూ ఒక రోజు వేతనంగా అందజేసిన రూ.5లక్షలు సాయాన్ని అతని కుమార్తె హనీప్రియకు అందజేశారు. అలాగే పొన్నూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యం వలన విధులకు హాజరుకాలేక వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్న హోంగార్డు కె.మోహన్‌శేషుకుమార్‌కి హోంగార్డులు అందరూ ఒక రోజు వేతనంగా చేసిన రూ.4లక్షలు సాయం చెక్కును అందజేశారు.

# నిరుద్యోగుల ముసుగులో టీడీపీ దొంగ ర్యాలీలు

- దేశంలో ఎక్కడా లేని విధంగా 2.14 లక్షల ఉద్యోగాలిచ్చిన ఘనత జగనన్నదే
- బాబుకంటే ముఖ్యమంత్రి ఇచ్చిన ఉద్యోగాలే ఎక్కువ
- ఉనికి కోసం ప్రతి విషయాన్ని రాజకీయం చేయడం దారుణం
- ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి పరిపాలనలో దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. చంద్రబాబు ఐదేళ్లలో ఇచ్చిన ఉద్యోగాలకంటే అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే 2.14 లక్షల గ్రామ సచివాలయ ఉద్యోగాలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ ఎన్ని ఆర్థిక సమస్యలు ఉన్నప్పటికీ 6,100 టీచర్ ఉద్యోగాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇస్తే టీడీపీ నాయకులు సిగ్గులేకుండా నిరుద్యోగుల పేరుతో ధర్నాలు చేయడాన్ని తప్పు పట్టారు. మాజీ ఎమ్మెల్యే జి.వి ఆంజనేయులు నిరుద్యోగుల పేరుతో టీడీపీ కార్యకర్తలు, జనసేన, ఇతర పార్టీల కార్యకర్తలను వెంట వేసుకుని ఆందోళన చేయడం తప్పుబట్టారు. ప్రజల్లో ఉనికి కోల్పోయిన టీడీపీ నాయకులు ఏదో ఒక వంకతో ప్రజల్లో ర్యాలీలు చేయడం, ఆందోళనలు చేయడం అలవాటుగా చేసుకున్నారని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తుంటే కోర్టుల్లో కేసులు వేసి అవి కుడా వారికి దక్కకుండా కుట్రలు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు ఎలాంటి అవినీతికి తావులేకుండా డీబీటీ పద్ధతిలో ప్రజలకు నేరుగా అందుతున్నాయని రిజర్వ్ బ్యాంక్, దేశ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అభినందించినట్లు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే జి.వి ఆంజనేయులు 10 ఏళ్ల ఎమ్మెల్యేగా ఉండి అభివృద్ధి పనులను కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకోవడం తప్ప చేసిందేమీ లేదన్నారు. ఎన్ని కుట్రలు కుతంత్రాలు పన్నినా రానున్న రోజుల్లో అధికారంలో వచ్చేది మేమే నన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, కొప్పుకొండ సర్పంచ్ కోలా వీరాంజి, ఎస్.రామాంజనేయులతోపాటు పలువురు పాల్గొన్నారు.

# అనిల్ కుమార్ యాదవ్‌కు ఘన స్వాగతం పలుకుదాం

## వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు



చిలకలూరిపేట: నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయనున్న మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్‌కు ఘన స్వాగతం పలుకుదామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు చెప్పారు. పట్టణంలోని మంగళవారం మాట్లాడారు. బుధవారం నరసరావుపేటలో నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొనేందుకు ముందుగా ఆయన చిలకలూరిపేటకు చేరుకుంటారని వెల్లడించారు. ఉదయం 11 గంటలకు మండలంలోని బొప్పూడి ప్రసన్నాంజనేయస్వామి దేవాలయానికి చేరుకుంటారని తెలిపారు. అక్కడ ముందుగా ఆయనకు ఘన స్వాగతం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నా రు. ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో పూజల అనంతరం ర్యాలీగా పట్టణంలోని అడ్డరోడ్డు సెంటర్‌కు చేరుకుంటారని తెలిపారు. అక్కడి నుంచి పురుషోత్తమపట్నం, మద్దిరాల, యడవల్లి, కట్టుబడివారిపాలెం, కోటప్పకొండ పెట్లూరివారిపాలెం మీదుగా నరసరావుపేట సభకు చేరుకుంటారని వెల్లడించారు.

# 26న బోయపాలెంలో ఆలయం ప్రతిష్ట

- రూ.10 లక్షలతో దేవస్థానం,
- ప్రాంగణానా స్వామివారి నామాలు ఏర్పాటు



దేవస్థాన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సభ్యులు

యడ్లపాడు: మండలంలోని బోయపాలెం గ్రామంలో శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రతిష్ఠా మహోత్సవాన్ని ఈనెల 26వ తేదీన నిర్వహించనున్నట్లు గ్రామ పంచాయతీ సర్పంచ్ వడ్డేపల్లి నరసింహరాజు తెలిపారు. గ్రామస్తుల సహకారంతో రూ.10 లక్షలతో హైవే పక్కన గతేడాది డిసెంబర్ 17న శంకుస్థాపన చేయగా కేవలం రెండు నెలల్లో దేవస్థాన పనుల్ని వేగంగా పూర్తి చేయడం జరిగిందన్నారు. ఆలయ ప్రతిష్ట కార్యక్రమాల్ని పురస్కరించుకుని ఈనెల 24న గ్రామంలో శోభాయాత్ర ఉంటుందన్నారు. అదే రోజు నుంచి దేవస్థాన ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, హోమాలు ప్రారంభమవుతాయన్నారు. మూడవ రోజైన సోమవారం ఉదయం 6.30 గంటలకు పూజలు, హోమాలు ప్రారంభమౌతాయ న్నారు. పూజల అనంతరం వేదపండితులచే స్వామి వారి విగ్రహా ప్రతిష్ట జరుగుతుందన్నారు. 11.30 గంటలకు సర్వదర్శనం, 12 గంటలకు ప్రతిష్ఠా కార్యక్రమానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాద వితరణ మొదలవుతుందన్నారు.

# ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరి మృతి

నరసరావుపేటటౌన్: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం .. పొడిమర్రు గ్రామానికి చెందిన మొగిలి సాయికృష్ణ (30) ద్విచక్ర వాహనంపై ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పెట్రోల్ బంక్ వద్దకు వస్తుండగా ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాల వద్దకు తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ మంగళవారం తెలిపారు.